# పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్
- జీహెచ్ఎంసీ సిబ్బందితో సమావేశం


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ శుభ్రంగా ఉండేలా చూడాలని ఈ మేరకు జీహెచ్ఎంసీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలు రోడ్లపై చెత్తను వేయకుండా వారికి అవగాహన కల్పించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అమ్మగార్డెన్‌లో జీహెచ్ఎంసీ సిబ్బందితో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. రోడ్లపై చెత్తను వేసే వారికి జరిమానా విధించాలన్నారు. వర్షం వచ్చినప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండి డ్రైన్లు నిండకుండా సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. వర్షాకాలంలో శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని సూచించారు. ప్రజల నుంచి కార్యాలయానికి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ఎస్ఎఫ్ఏ సూపర్‌వైజర్లు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో యూసీడీ, ఎస్‌బీఎం శ్రీనివాస్, డీఈవో రాధారాణి, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


హాజరైన జీహెచ్ఎంసీ సిబ్బంది

# ముగిసిన గ్లోబల్ డైవర్సిటీ

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ ఉద్యోగుల ఉద్యోగం ,సామాజిక సేవ తదితర అంశాలపై నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సింక్రోనీలో నిర్వహించిన ఇండియా గ్లోబల్ డైవర్సిటీ ఎక్స్‌పీరియన్స్ సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో నెట్‌వర్కింగ్ అవకాశాలు, కమ్యూనిటీ సర్వీస్ వర్క్‌షాప్ తదితర అంశాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. ప్రముఖ ఎన్‌జీఓ యంగిస్తాన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో పట్టణ మురికివాడలలో నివసించే పాఠశాల విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ కిట్స్ రూపొందించారు. ఈ కిట్‌లలో స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, స్టేషనరీ బాక్సులు, స్నాక్ బాక్స్‌లు, నోట్‌బుక్‌లు, న్యూట్రిషన్ బార్‌లు వంటివి ఉన్నాయి. కార్యక్రమంలో మాజీ ఆర్మీ అధికారి, ప్రొఫెషనల్ మేజర్ వందనా శర్మ కీలకోపన్యాసం చేశారు. సింక్రోనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ సెహగల్ తదితరులు మాట్లాడారు.

# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ శ్రీ జ్ఞాన వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేశారు.

## ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలి

సుల్తాన్‌బజార్: విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసి ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వైద్య విద్యార్థులకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలని పలువురు వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వద్ద వైద్య విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమ డిమాండ్లపై టీఎంసీ చైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు ఖలీల్, మణికుమార్, రశ్మితలు మాట్లాడుతూ...... 2021లో విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఒక సంవత్సరం పాటు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన తమకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలని గత ఏడు నెలలుగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పుడు ఏడాది పాటు మరో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని ఎంఎంసీ నిబంధనలకు విరుద్ధమని వైద్య విద్యార్థులు మండిపడ్డారు. కౌన్సిల్ అధికారుల నిర్లక్ష్యంతో తమ భవిష్యత్తు నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఢిల్లీ, యూపీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో ఉపకార వేతనంతో పాటు ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేసిన విదేశీ విద్యార్థులకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ అందజేశారని వారు తెలిపారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన తమకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ కల్పించి న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం జరగకపోతే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా తెలంగాణ మెడికల్ కౌన్సిపల్ చైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్ ఈ అంశాన్ని కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు.

## రేపు తెలంగాణ రాష్ట్ర సాధకుల డాక్యుమెంటరీ ప్రారంభం

గన్‌ఫౌండ్రీ : తెలంగాణ ఉద్యమకారుల చరిత్రను తెలియజేయడానికి ఈ నెల 18 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధకుల డాక్యుమెంటరీని ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు అయిన సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సాధన ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ రెడ్డి, కన్వీనర్లు వెంకటేష్ గౌడ్, జ్యోతి రెడ్డి, ఉపాధ్యక్షులు కె.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ


ర్యాలీని ప్రారంభించిన మెడికల్ ఆఫీసర్ డా.చందర్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం డెంగీ నివారణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రమైన వాతావరణం డెంగీ నివారణ మార్గమని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కాలనీవాసులకు సూచించారు. దోమలతో అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ర్యాలీ గుల్‌మొహర్‌పార్కు కాలనీ నుంచి లింగంపల్లి రైల్వే స్టేషన్, పీజేఆర్ స్టేడియం వరకు కొనసాగింది. కార్యక్రమంలో సీహెచ్ఏ స్వామి, పీహెచ్ఎన్ శ్యామల, ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణరెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఈవీవీ కాలనీ పక్కన పొంగి ప్రవహిస్తున్న పందెన్‌వాగు

# దంచికొట్టిన వాన..


వర్షం నీరు వెళ్లేలా చర్యలు చేపడుతున్న జీహెచ్ఎంసీ మాన్‌సూన్ సిబ్బంది


రోడ్లపై నిలిచిన వరద

- ఎక్కడికక్కడ నిలిచిన వరద
- ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, బస్తీల్లో వరద నిలిచిపోయింది. దీంతోపాటు డ్రైనేజీలు పొంగిపొర్లడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉప్పర్‌పల్లి పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 161 శివరాంపల్లి బెస్ట్ ప్రైస్ ప్రాంతాల్లో నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో జీహెచ్ఎంసీ మాన్‌సూన్ సిబ్బంది వెంటనే స్పందించి నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. వరద నిలిచిన ప్రాంతాలను సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ పరిశీలించి సిబ్బంది, అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

**బాబుల్‌రెడ్డినగర్‌లో**

**రోడ్డుపైనే నిలిచిన నీరు..**

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతంలో రోడ్లపైనే నీరు నిలిచింది. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని నీరు నిల్వ ఉండకుండా చూడాలని నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులను కోరారు.

**మణికొండలో ..**

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం కాగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. మణికొండ ల్యాంకోహిల్స్ నుంచి అంజలిగార్డన్ రోడ్డులో పెద్ద ఎత్తున వరద పారింది. పంచవటి, సెక్రటేరియట్‌కాలనీ, మణికొండ గ్రామాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. పంచవటి కాలనీ, అంజలిగార్డన్, సెక్రటేరియట్ కాలనీలో వృక్షాలు రోడ్లపై కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పంచవటి కాలనీలో చెట్టు కార్లపై కూలడంతో పాక్షికంగా ధ్వంసమయ్యాయి. మణికొండ మల్లన్న ఆలయం వద్ద హైమాస్ట్ లైట్ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మున్సిపల్ సిబ్బంది శ్రమించి వాటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. నార్సింగి ప్రధాన రోడ్డుతో పాటు బాలాజీనగర్ కాలనీ రోడ్లపై నీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అరగంట సేపు భారీగా వర్షం కురిసి తర్వాత తగ్గిపోవడంతో ఓ గంట తరువాత రోడ్లపై నీరు తగ్గడంతో రాకపోకలు సాగించారు.


అంజలిగార్డెన్‌లో కారుపై కూలిన చెట్టు


మణికొండ మల్లన్న ఆలయం వద్ద పడిపోయిన హైమాస్ట్ లైట్


పంచవటి కాలనీలో రోడ్లపై నీటిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## సీఆర్ ఫౌండేషన్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణను ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ జోస్యభట్ల కల్పన ఫోన్ : 9603196925లో సంప్రదించవచ్చు.

## 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'సక్సెస్ మంత్రాస్' అనే అంశంపై ద్రోణాచార్య అవార్డు గ్రహీత, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ రమేష్ నాగపూరి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## 'మనూ'లో ఎంఏ అరబిక్‌లో ప్రవేశాలు

రాయదుర్గం: మనూలో అరబిక్ విభాగంలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరడానికి జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేయాలని అరబిక్ విభాగం అధిపతి ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ జైసీ గురువారం తెలిపారు. హైదరాబాద్‌క్యాంపస్‌లో 60సీట్లు అందుబాటులో ఉండగా లక్నో క్యాంపస్‌లో 30 సీట్లు ఉన్నాయన్నారు. స్థానికేతర విద్యార్థులకు హాస్టల్ వసతి పరిమిత సామర్థ్యంతో ఉంటుందన్నారు .మరిన్ని వివరాలకు.. డాక్టర్ ముఫ్తీ మహ్మద్ షరాఫే ఆలమ్– 9705610569, డాక్టర్ ఆసిఫ్ లాయిక్–8801589585లో సంప్రదించాలని సూచించారు.

# అక్రమ నీటి సంపుల తొలగింపు


హిమాయత్‌సాగర్‌లో జేబీబీతో అక్రమ నీటి సంపులను తొలగిస్తున్న సిబ్బంది


గంధంగూడలో అక్రమ నీటి సంపులను తొలగిస్తున్న సిబ్బంది

బండ్లగూడ: అక్రమంగా ఏర్పాటు చేసిన నీటి సంపులను గురువారం అధికారులు తొలగించారు. గండిపేట్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్ఐలు విక్రంరెడ్డి, సురేష్ రెడ్డి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ సర్వే నంబర్ 62లో మూడు, హిమామయత్‌సాగరలో 4 అక్రమ నీటి సంపులను నేలమట్టం చేశారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

# వాహనాలు తీసుకెళ్లాలి.. లేదంటే వేలం

సైబరాబాద్ పోలీసు అధికారులు

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వివిధ సందర్భాలలో పట్టుబడిన వాహనాలకు సంబంధించి యజమానులు తగిన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని లేదంటే ఆ వాహనాలను వేలం వేయనున్నట్టు సైబరాబాద్ పోలీసు అధికారులు తెలిపారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్స్‌లో 522 వాహనాలను చట్ట ప్రకారం వేలం వేయాలని నిర్ణయించారు. వాహనానికి సంబంధించిన యజమానులు ఎవరైనా అభ్యంతరం కలిగి ఉంటే నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరు మాసాల వ్యవధిలో సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో తమ క్లెయిమ్ చేయాలి .వాహనాల వివరాలు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎంటీఓ–2 ఎన్ వీరలింగం సెల్ నంబర్ 9490617317లో సంప్రదించాలి. అంతేకాకుండా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్‌లో కూడా వివరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

# 45 రోజుల పసికందుకు అరుదైన శస్త్రచికిత్స


సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు, తల్లిదండ్రులు

మాదాపూర్: నాలుగు రోజులుగా పొత్తికడుపు వాపు, వాంతులతో బాధపడుతున్న 45 రోజు ల పసికందుకు మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం విలేకరుల సమావేశంలో డాక్టర్లు వెల్లడించారు. డాక్టర్ మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో శిశువు మూత్రవ్యవస్థ, వెన్నుముక, జననేంద్రియ ప్రాంతానికి సంబంధించిన సమస్య ఉందని దీన్ని యోనిఅట్రిసియా అంటారని తెలిపారు. సిస్టోస్కోపి ద్వారా చిన్న కెమెరాను ఉపయోగించి లాపరోటమీ సర్జరీ ద్వారా పేరుకుపోయిన ద్రవాలను తొలగించినట్టు తెలిపారు. 5గంటల పాటు శస్త్రచికిత్స చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మీ, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, పీడియాట్రిక్స్ విభాగం అధిపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సంధ్య, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని నివారించాలి

బండ్లగూడ: నీటి ఎద్దడిని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు జలమండలి మేనేజర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో రోజురోజుకు నీటి సమస్య అధికమవుతుందన్నారు. ప్రతి బస్తీ, కాలనీల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని 5, 6 రోజులకు ఒకసారి కూడా నీటిని సరఫరా చేయడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని మేనేజర్‌ను కోరామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

## దాడి కేసులో ముగ్గురి రిమాండ్

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన దాడి ఘటనలో ముగ్గురిని ఆర్‌జీఐఏ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అహ్మద్‌నగర్‌కు చెందిన యువకులు తగాదా పడుతుండగా రుద్రాకాలనీకి చెందిన బండి సురేశ్‌ముదిరాజ్ గొడవ ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో గొడవపడుతున్న వారిలో ఓ వర్గం యువకులు సురేశ్ తలపై రాడ్డుతో దాడి చేశారు. గమనించిన స్థానికులు ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించగా, మిగితా ఇద్దరిని గురువారం ఆర్‌జీఐ పోలీసులు అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించిన వారిలో అహ్మద్‌నగర్ బస్తీకి చెదిన తౌసిఫ్, సయ్యద్‌ఉమర్, మిర్జా అహ్మద్ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గాంధీనగర్ ప్రాంతంలో మంగళవారం రాత్రి 35–49 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా... అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు దొరకలేదని, సంబంధించిన ఎవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ సిబ్బంది లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు


ధ్వంసమైన బైక్

రాజేంద్రనగర్: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు గాయపడ్డ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అభ్యుదయనగర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాద దాటికి ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పీవీ నరసింహా రావు పిల్లర్ నంబర్ 312 ప్రాంతంలో వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. స్థానికంగా తిరుగుతూ పుట్‌పాత్‌పై నివసించేవాడని స్థానికులు పోలీసులకు వివరించారు. పంచనామా నిర్వహించిన మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఎలాంటి సమాచారం లభించలేదని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## పోక్సో కేసులో యువకుడికి పదేళ్ల జైలు

- బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం
- రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు తీర్పు


నిందితుడు సతీశ్‌కుమార్‌రెడ్డి

గచ్చిబౌలి: పెళ్లిపేరుతో మాయమాటలు చెప్పి బాలికను నమ్మించి అఘాయిత్యానికి పాల్పడిన ఓ నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజేంద్రనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు తీర్పు వెలువరించింది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లికి చెందిన కట్ల సతీశ్‌మార్‌రెడ్డి(23) డ్రైవర్‌గా పనిచేస్తూ మల్లాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. లట్టుపల్లికి చెందిన బాలిక(15)తోపాటు తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం గౌలిదొడ్డికి వచ్చారు. ఈ క్రమంలో ఆ బాలికలో అతడు తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో నమ్మించి, ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు జూలై 2017లో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అప్పటి ఎస్‌హెచ్‌ఓ గంగాధర్, ఏసీపీ చంద్రకాంత్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు రాజేంద్రనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి పి.ఆంజనేయులు గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి ప్రభుత్వం రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

## 25 నుంచి ట్రిపుల్‌ఐటీ సమ్మర్ స్కూల్

- పీఎల్ఎఫ్, హైసియాతో కలిసి నిర్వహణ
- నాలుగు వారాలపాటు'ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్'

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ కొత్తగా ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ సమ్మర్ స్కూల్‌ను ప్రకటించింది. ప్రొడక్ట్ లీడర్స్ ఫోరమ్ (పీఎల్ఎఫ్) హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా)తో కలిసి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు సంస్థలు కలిసి నాలుగు వారాల ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ సమ్మర్ స్కూల్‌ను ప్రారంభించినట్లు గురువారం ప్రకటించాయి. ఇందుకోసం రిజిస్ట్రేషన్లు తెరిచి ఉంచారని మే 25 తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందులో ప్రోగ్రామ్ ప్రొడక్ట్ మేనేజర్లు, డెవలప్‌మెంట్ మేనేజర్లు, ఆర్కిటెక్టులు, ఔత్సాహిక ఉత్పత్తి మేనేజర్లు, స్టార్టప్ వ్యవస్థాపకులను లక్ష్యంగా చేసుకొని ఏర్పాటు చేశారు.